విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 20, మే 2023

## బీజేపీ ఎంపిని కఠినంగా శిక్షించాలి

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల :** అంతర్జాతీయ క్రీడా వేదికల్లో పథకాలు సాధించి దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుడింపజేసిన మహిళ మల్లయోధులు(రెజ్లర్లు)లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ, డబ్ల్యూ ఎస్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ని కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ బాలకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాయి సమావేశ మందిరంలో ఆయా ప్రజా సంఘ నాయకులు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ క్రీడావేదికలైన ఒలంపిక్స్ కామన్ వెల్త్ ఏషియన్ గేమ్స్ తదితర పోటీలలో పథకాలను సాధించి ప్రపంచవ్యాప్తంగా దేశ ప్రతిష్టను పెంచిన క్రీడాకారులు నేడు న్యాయం కోసం ఢిల్లీ నడివీధుల్లో జంతర్ మంతర్ వద్ద న్యాయ పోరాటం చేస్తున్నారన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ పై ఎటువంటి చర్యలు తీసుకోకుండా బిజెపి ప్రభుత్వం అతన్ని కాపాడుతున్నదన్నారు. రెజ్లార్లకు మద్దతుగా ఏఐటీయూసీ అండగా ఉండి వారికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తుందన్నారు. బ్రిజ్ భూషణ్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకొని, డబ్ల్యూ ఎస్ అధ్యక్ష పదవి నుండి తొలగించి, ఎంపీ పదవీ నుండి బర్తరఫ్ చేసేంతవరకు పోరాటాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈరోజు రెజ్లర్లకు మద్దతుగా ఏఐటీయూసీ కొలిమిగుండ్ల మండల సమితి ఆధ్వర్యంలో ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు.సమావేశంలో సీపీఐ నాయకులు సూర్య నారాయణ,ఏఐటీయుసి మండల కార్యదర్శి రామకృష్ణ, నాయకులు శివయ్య, రాముడు, కంబగిరి స్వామి, మహేష్ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు బయమ్మ, లక్ష్మీదేవి, ఆయా వర్కర్ల యూనియన్ నాయకురాలు రాధమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు

**విశాలాంధ్ర - డోన్ రూరల్ :** ప్లాస్టిక్ వాడకం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని కన్నపుకుంట సర్పంచ్ కళ్యాణి అన్నారు. స్థానిక కన్నపు కుంట గ్రామంలో ప్లాస్టిక్ వాడకం పర్యారనానికి ముప్పు అన్న అంశంపై ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన తీవ్ర అనర్థాలు రావడమే కాకుండా పర్యావరణానికి కూడా పెను ముప్పు సంభవిస్తుందని తెలిపారు. ప్లాస్టిక్ సంచులు మట్టి లో కలవక పంటల దిగుబడి లేకపోవడం కూడా జరుగుతుందని, ప్లాస్టిక్ వాడకం వల్ల మానవాళి మనుగడకు అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చివరి స్థానంలో ఉండడం సిగ్గుచేటు

**విశాలాంధ్ర - ఉయ్యాలవాడ :** ప్రభుత్వ పాఠశాలల్లో మనబడి నాడు నేడు పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా నంద్యాల జిల్లాలో ఉయ్యాలవాడ మండలం చివరి రెండు స్థానాల్లో ఉండడం సిగ్గుచేటని ఎంఈఓ అనురాధ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నాడు నేడుకు ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు నేడు పనులపై ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అలసత్వం చూపడంతోనే కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాల్లో ఉయ్యాలవాడ మండలం అట్టడుగు స్థాయిలో ఉందని తెలిపిన ప్రతిసారి మనసుకు ఎంతో బాధ కలుగుతోందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రధానోపాధ్యాయుల ఖాతాలలో రూ.1,85,20,000లు జమ చేయడం జరిగిందన్నారు. ఉయ్యాలవాడ, మాయలూరు ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, బాత్రూంల పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాఠశాలలు పునః ప్రారంభమయ్యే లోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ శాఖ ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సిఆర్పిలు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు అవగాహన సదస్సు

**విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ :** మండలంలోని ఆత్మకూరు అర్బన్ రైతు భరోసా కేంద్రం నందు కౌలు రైతు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అర్బన్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ షేక్ బైరాపురం మహబూబ్ బాషా మాట్లాడుతూ ఎవరైతే పొలం కౌలు తీసుకొని సాగు చేస్తున్నారో వారు తప్పనిసరిగా సీసీఆర్ సి కార్డు పంట సాగు హక్కు పత్రం తీసుకోవాలన్నారు. సీసీఆర్ సి కార్డు ఉంటే డాక్టర్ వైయస్సార్ రైతు భరోసా, పంట నమోదు, పంట బీమా, ఇన్పుట్ సబ్సిడీ తదితర పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని తెలిపారు. కౌలు తీసుకున్న రైతు అందుకు సంబంధించిన అగ్రిమెంట్, ఆధార్ కార్డు, పాసు ఫోటోసైజ్ ఫోటో, భూ యజమాని 1బి తదితర జిరాక్స్ కాపీలను సంబంధిత గ్రామ రెవెన్యూ ఆఫీసర్ కి ఇచ్చి సీసీఆర్ సి కార్డు పొందాలని తెలపారు. కౌలు రైతు సంఘం అధ్యక్షులు తపాలా ఆస్రఫ్అలీ, గ్రామ రెవెన్యూ అధికారి సి నాగరాజు, వ్యవసాయ సిబ్బంది, మోమిన్ ఇబ్రహీం, మోమిన్ మునీర్ భాష, టీ అజ్మతుల్లా, బాబు, పెద్ద లింగమూర్తి, శ్రీనివాసులు, శిఖమని, జి రఫీక్, నాగరాజు, మాలిక్ రైతులు పాల్గొన్నారు.

## చదరంగం పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

**విశాలాంధ్ర - నంద్యాల :** ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో జూన్ నెల 8వ తేదీ నుండి 11వరకు నాలుగు రోజులపాటు నంద్యాల రామకృష్ణ పిజి కళాశాల ఆవరణలో జరగనున్న రాష్ట్ర స్థాయి 19 సంవత్సరాల లోపు ఫిడే ర్యాంకింగ్ ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీల వివరాలతో రూపొందించిన బ్రోచర్‌ను శుక్రవారం నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా ఆవిష్కరించారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామ సుబ్బారెడ్డి, టోర్నమెంట్ చైర్మన్ హేమంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటీవల కాలంలో నంద్యాల ప్రాంతంలో చెస్ కు విశేష ఆదరణ రావడంలో నంద్యాల చెస్ అసోసియేషన్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ 50వేల నగదు బహుమతులతో పాటు విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందిస్తామని, రాష్ట్రం నలుమూలల నుండి పోటీల్లో పాల్గొంటున్న వారికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.మే 31వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, వివరాల కోసం 9010451585 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

## సాగునీరు అందించేందుకు అధికారులు చొరవ చూపాలి

**విశాలాంధ్ర - జూపాడుబంగ్లా :** మండ్లెం గ్రామంలో రైతులు చేస్తున్న జల దీక్ష పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడి సాగునీరు అందించేందుకు అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని,కృష్ణ బ్యాక్ వాటర్ పరిధిలో ఎత్తిపోతల ఏర్పాటుకు కృషి చేయాలని లేని పక్షంలో ఉద్యమ ఉధృతం చేస్తామని సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు హెచ్చరించారు. గ్రామ రైతులు 24వ రోజు జల దీక్షను శుక్రవారం రైతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు మాట్లాడుతూ గత 24 రోజులుగా రైతులు జల దీక్ష కార్యక్రమం చేపట్టి తమ న్యాయమైన సాగునీటి సాధనకై పోరాటం కొనసాగిస్తున్నారని అధికారులు పర్యటించి పది రోజులు అవుతున్న ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడానికి ఎలాంటి ఆటంకాలు లేవని చుట్టుపక్కల నీరు ఉంది కానీ ఉపయోగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల న్నారు. ఈ ప్రాంతంలో ఉన్న నీరు వేల కిలోమీటర్ల దూరం వెళుతూ రైతులను ఆదుకుంటుంది తప్ప రెండు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రైతులను ఆదుకో వడం లేదని తక్షణమే కృష్ణా జలాలు అందించేందుకు ఒక ఎత్తిపోతల పథకాన్ని శాశ్వతంగా నిర్మించి మండ్లెం, తంగడంచ,భాస్కరపురం గ్రామాల పరిధిలో ఉన్న ఐదువేల ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు నిర్లక్ష్యం వీడి సమస్య పరిష్కరించాలని లేని పక్షంలో మరింత ఉధృతం చేస్తామని అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను కలుస్తామని రాష్ట్ర స్థాయిలోఆందోళననిర్వహిస్తామన్నారు.రైతులు సురేషు,శివప్రసాద్, స్వామిదాసు, రాజు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికిన బీసీ

**విశాలాంధ్ర - బనగానపల్లె :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం సాయంత్రం నంద్యాల నియోజకవర్గం రాయ పాడు వీడిది కేంద్రం నుంచి బనగానపల్లె నియోజకవర్గం లోని బనగానపల్లె మండలం సరిహద్దు ప్రాంతమైన టంగుటూరు గ్రామం నుంచి సాయంత్రం 4గంటలకు ప్రారంభమైంది. ఈ సందర్భంగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం టంగుటూరు అప్పులాపురం గ్రామం మీదుగా సుమారు పది కిలోమీటర్లు విశేష జనవాహిన రాగ కైప గ్రామంలో ఏర్పాటు చేసిన విడిది కేంద్రం చేరుకోవడంతో శుక్రవారం యువగళం పాదయాత్ర ముగిసింది. మార్గ మధ్యంలో టంగుటూరు, అప్పులా పురం గ్రామాల్లో రైతులతో సమస్యల గురించి చర్చించారు. బిసి మనోహర్ రెడ్డి,మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి, బిసి రామ్నాథ్ రెడ్డి, ఐవి పక్కిరెడ్డి, బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకులు టంగుటూరు సీనయ్య,బొబ్బల గోపాల్ రెడ్డి, తులసి రెడ్డి, ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, బెడుదల మహేశ్వర్ రెడ్డి,కాసింబాబు, బురానుద్దీన్, ఆల్తాఫ్, అమర్నాథ్ రెడ్డి,రఘునాథ్ రెడ్డి, సంకేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, బండి మౌళీశ్వర్ రెడ్డి, పివి కుమార్ రెడ్డి,సలాం పాల్గొన్నారు.

## నాయకుల మౌనం రాయలసీమకు శాపం

**విశాలాంధ్ర - శిరివెళ్ల :** రాజకీయనాయకుల మౌనం వహించడంతోనే రాయలసీమకు అన్యాయం జరుగుతుందని, చెవుల్లో సీసం పోసుకున్నారని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి రాయలసీమ నేతలపై నిప్పులు చెరిగారు. శుక్రవారం శిరివెళ్ల లోని నాలుగు రోడ్ల కూడలిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బైరెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ నేతల చేతగాని తనంతో రాయలసీమకు శాపం గా మారిందని, తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటకలో అప్పర్ భద్ర డ్యామ్ కడుతున్నా, సంగమేశ్వరం వద్ద తీగెల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ కోసం ప్రయత్నిస్తున్న రాయలసీమ నాయకులు మాట్లాడకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాయలసీమకు ప్రధాన శత్రువులు రాజకీయ నాయకులు, సినీ పరిశ్రమ అని అన్నారు. 52 నియోజకవర్గాల్లో సేవ్ రాయలసీమ పేరుతో సంతకాల సేకరణ నిర్వహించగా అందరూ ఆదరిస్తున్నారని, లక్షమంది సంతకాలు చేసి మద్దతు తెలిపారని వివరించారు.రాయలసీమలోని కడప, కర్నూల్,చిత్తూరు,అనంతపురం జిల్లాల్లో ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, తీగెలవంతెన ఏర్పాటుచేస్తే సెల్ఫీలు, సినిమా షూటింగులకు మాత్రమే పనికి వస్తుందని బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మిస్తే 60 టీఎంసీల నీరు నిలువచేస్తే రాయలసీమ ప్రాంతావాసులకు నీటి సమస్య ఉండదని అన్నారు. కర్ణాటకలో అప్పర్ భద్ర డ్యామ్ నిర్మిస్తే రాయలసీమకు ఉరితాడులాంటిదని గమనించాలని, కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌లో పూడికల వల్ల కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు, రాయలసీమలో 4 జిల్లాలు తెలంగాణలో కొన్ని ప్రాంతాల ప్రజలు నష్టపోతారని అన్నారు. కర్నూల్ ఎస్టీబిసి కళాశాలలోనే నష్టపోయామని గుర్తుచేశారు. 1952లో జవహర్ లాల్ నెహ్రూ కర్నూల్ లోని ఎస్టీబిసి కళాశాలలోనే కర్నూల్ రాజధానిగా ప్రకటించారని, కేవలం మూడేళ్లకే రాజధానిని తరలించుకుపోతున్న అడిగిన నాథుడే లేరన్నారు. రాయలసీమ సమస్య కోసం త్వరలో ఛలో ఢిల్లీ నిర్వహిస్తున్నామన్నారు. రాయల సీమ గల్లీ, గల్లీల్లో జై రాయలసీమ నినాదాలు చేస్తామని ప్రత్యేక రైళ్లలో వేలాది మంది తో త్వరలో ఢిల్లీ కి ర్యాలీ చేపడతామని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తెలిపారు . రాయలసీమ బాగుకోసం రాజకీయనాయకులు ఇప్పటికైనా గళం విప్పాలని కోరారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు యం. ఎస్. నవీన్ కుమార్, యం. వి. రమణారెడ్డి, గోపాల్ యాదవ్, నందకుమార్ యాదవ్, శివ ప్రసాద్ రెడ్డి, బీమవరం రామచంద్రారెడ్డి, మునగాల తూము శివారెడ్డి, శ్రీలక్ష్మి, చెన్నమ్మ, తదితరులు పాల్గొని సంతకాల సేకరణ, కరపత్రాలు పంపిణి చేశారు.

## విక్టర్ ఇమ్మానియేల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలి

**విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ :** మండల పరిధిలోని రంగాపురం గ్రామ జడ్పీహెచ్ పాఠ శాలలో ఇంటి దొంగను రంగాపురం గ్రామ ప్రజలు పాఠశాల ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు దాత మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల అభివృద్ధికై సుమారు నాలుగు లక్షల విలువైన ఐరన్ డెస్కులను పాఠశాలకు విరాళంగా ఇచ్చారు. అయితే సామాగ్రిని ధనార్జనే ధ్యేయంగా,నేను చెప్పిందే వేదం, చేసిందే శాసనం నాకు ఎవరు ఎదురు చెప్పకూడదు అని హుకుం జారీ చేసి ఉన్నతాధికారుల అనుమతి లేకుండా దాతల నుండి సేకరించిన నాలుగు లక్షల విలువైన సామాగ్రిని సంబంధిత ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వారి నుండి డెస్కుల సామర్థ్య పత్రం తీసుకో కుండా,టెండరు ప్రకటనను పత్రికలకు ఇవ్వకుండా, విద్యా కమిటీకి చెప్పకుండా తీర్మానం పై సంతకాలు తీసుకొని కేవలం ధనార్జనే ధ్యేయంగా ప్రవేటు పాఠశాలకు విక్రయిం చిన హెడ్మాస్టర్ విక్టర్ ఇమ్మా నియేల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కలెక్టర్ ఫిర్యాదు చేయడంతో శుక్రవారం విచారణ అధికారిగా ఉపవిద్యాధికారి క్రిస్టఫర్ రంగాపురంలో పాఠశాలను సందర్శించి ఫిర్యాధి,ప్రతినిధిగా సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్ యన్నా ప్రతినిధిగా హాజరై హెడ్మాస్టర్ చేసిన అవినీతిపై పూర్తిస్థాయి రిపోర్టును రాతపూర్వకంగా అందచేవారు.డిప్యూటీ డిఈఓ క్రిస్టోఫర్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు చేసిన నేరాన్ని అంగీకరించారన్నారు. తక్షణమె సస్పెండ్ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు.అధికారాలు ఆయనను కాపాడాలని ప్రయత్నిస్తే వారిపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు దిలీప్,పాఠశాల పూర్వ విద్యార్థులు రామస్వామి,మద్దిలేటి, రామ మద్దయ్య, నల్లారెడ్డి,తదితరులు పాల్గొని అవినీతి తిమింగళమైన రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్టర్ ఇమ్మానియేల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## పార్సెల్స్ చోరీ చేస్తూ దొరికిన దొంగ

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల :** రన్నింగ్ హైటెక్ బస్ టాప్ పై ఉన్న పార్సిల్స్‌ను చోరీ చేస్తూ ప్రయాణికులకు దొంగ పట్టుపడ్డ ఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు గుంతకల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గుంతకల్ నుండి నెల్లూరుకు వెళ్తు మార్గమధ్యలో చోరీ ఘటన చోటు చేసుకుంది. తాడపత్రి చెందిన చోరీదారుడు ఎవరికి తెలియకుండా బస్ టాప్ పై పార్సెల్స్ మధ్య కూర్చుని బస్సు బుగ్గ దాటి కొండ ప్రాంతంలోకి రాగానే వేగం తగ్గడంతో పార్సెల్సును కిందికి వేస్తూ వస్తున్నాడు. దీంతో అనుమానం వచ్చిన బస్సు డ్రైవర్ ప్రయాణికులను అప్రమత్తం చేసి అంకిరెడ్డిపల్లి గ్రామంలోకి రాగానే బస్సును ఆపాడు. ప్రయాణికులు చోరికి పాల్పడుతున్న దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి కొలిమిగుండ్ల పోలీసులకు అప్పగించారు. మూడు సంచుల జీన్స్ పార్సెల్సును మార్గమధ్యలో కిందికి వేసినట్టు డ్రైవర్ గుర్తించాడు. చోరీకి పాల్పడిన వ్యక్తి అనంతపురం జిల్లా తాడపత్రి మండలం నందలపాడు వాసిగా గుర్తించారు.

## వాలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం

**విశాలాంధ్ర - నంద్యాల :** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వాలంటీర్లు అందిస్తున్న సేవలు అభినంద నీయమని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది చేపట్టిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంపై విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో ప్రసార మైన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కార్యక్ర మాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోసుబ్బారెడ్డి, డిఎల్డిఓ జనార్ధన్, సంబంధిత అధికారులు, వాలంటీర్లు, పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ వార్డు వాలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి అందజేయడంలో వాలంటీ ర్లు కీలక పాత్ర పోషించారన్నారు. వారు చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది వాలంటీర్లకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ పరిణామన్నారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను చేరవేస్తున్న వాలంటీర్ల సేవలు వెలకట్టలేన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులుగా వాలంటీర్లు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మరింత మంచి పేరు తీసుకు రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఉత్తమ సేవ అందించిన కే.ప్రదీప్, పి.వసుందర, పి.శివ కుమార్,ఎస్.రబియ, రియాజ్ ఖాన్, ఎం.శ్వేత, ఎస్.మహబూబ్, ఎస్.ఖరీముల్లా, నరసింహ రెడ్డి, ఎం.అనిత, జే.భాస్కర్ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవా మిత్రా, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలను కలెక్టర్, ఎమ్మెల్యే, తదితర ముఖ్య అతిథులు ప్రధానం చేశారు. సేవా మిత్రా, సేవా రత్న, సేవా వజ్ర వచ్చిన వారినందరినీ అభినం దిస్తున్నామని, పురస్కారం పొందడంతో మరింత బాధ్యత పెంచుతుందని కలెక్టర్ గుర్తు చేశారు.

**నందికొట్కూరు :** గ్రామాలలో, పట్టణాలలో నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తూ ప్రజల మన్నలు పొందుతున్న స్వచ్ఛంద సేవకుడే గ్రామ వాలెంటరు అని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక జై కిసాన్ పార్క్‌లో మున్సిపాలిటీ పరిధిలోని వాలెంటరులకు వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెండవ వార్డ్ కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్, మూలింటి లక్ష్మీదేవి హాజరు కావడం జరిగింది.గ్రామ వాలంటీర్లను నగదుతో పాటు సర్టిఫికెట్లతో శాలువలు కప్పి సత్కరించడం జరిగింది.సచివాలయాల సిబ్బంది, వాలంటర్లు పాల్గొన్నారు.

### మాజీ సిఎం దిష్టిబొమ్మను దగ్ధం

**విశాలాంధ్ర - శిరివెళ్ల :** మండల కేంద్రంలోని కటిక సెంటర్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను స్థానిక వైసీపీ ఎమ్మెల్యే గంగుల బిచంద్రారెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా శిరివెళ్ళకు విచ్చేసిన ఎమ్మెల్యే ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాయక్ దిల్దార్ ముజఫర్ హుస్సేన్, ఇతర వైసీపీ నేతల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంగుల టిడిపి అధినేత చంద్రబాబు దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. రాష్ట్రంలో ని ఇల్లు లేని పేదలకు ఫలాలు పంపిణీ చేస్తుంటే సహించలేని చంద్రబాబు పేదలపై అనుచితంగా మాట్లాడారని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంధూరి ప్రతాప్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి నాయక్ నజీర్.సీనియర్ నాయకులు బశాపురం అబ్దుల్ సలాం, డి తిమ్మారాయుడు,చంద్ర, ఎంపీటీసీ లు, వార్డు సభ్యులు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ జీవనశైలి అలవరచుకోవాలి

**విశాలాంధ్ర - చాగలమర్రి :** అటవీ ప్రాంత సమీప గ్రామాల ప్రజలు పర్యావరణ జీవనశైలిని అలవరచుకోవాలని రుద్రవరం రేంజ్ అధికా శ్రీపతి నాయుడు తెలియజేశారు. మండలంలోని కేపీ తండా, చింతలచెరువు, భైరవగుండాల క్షేత్రంలో ప్రజలకు పర్యావరణ జీవనశైలిపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను వాడటం మానేయాలన్నారు. ఇంధనాని నమ్మకుండా వ్యక్తి శరీర శ్రమను నమ్మాలన్నారు. నీటిని పొదుపుగా వాడితేనే భావితరాలకు ఉంటుందని వివరించారు. ఫారెస్టర్ కిషోర్ కుమార్, ఎఫ్బీవోలు సుభాష్,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**విశాలాంధ్ర - అవుకు :** పట్టణంలోని కుమ్మరిది వీధికి చెందిన ముదిగేడు బాల సుబ్బయ్య గురువారం మృతి చెందడంతో బలిజ సంఘం సభ్యులు శుక్రవారం ఉదయం బాలసుబ్బయ్య మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులు పరామర్శించారు. బాలసుబ్బయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. మాట్లాడు తూ బలిజ సోదరులకు ఏ సమస్య వచ్చినా ఆదుకోవడానికి సంఘం సిద్ధంగా ఉందని అన్నారు. బలిజ సోదరులంతా ఐకమ త్యంగా ఉండి సంఘం పటిష్టం కావడానికి ప్రతి ఒక్క బలిజ సోదరుడు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు కునుకుంట్ల రమణ, సెక్రెటరీ పొన్నపాటి రమణ, జాయింట్ సెక్రెటరీ వేటూరి రమణ, జక్కా మధు, గాజుల కృష్ణ కుమార్, మావిళ్ళ సుబ్బన్న, గుర్రాల రామాంజనేయులు, మెడికల్ ప్రసాద్ , చిన్న కంబగిరి స్వామి,వేణు, హరి ప్రతాప్ తదితర సంఘం సభ్యులు పాల్గొన్నారు

## పేదల పక్షపాతి సీఎం జగన్

**విశాలాంధ్ర - డోన్ రూరల్ :** పేదల పక్షపాతి సీఎం జగన్మోహన్ రెడ్డి అని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అమరావతిలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం 50,000 ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్న చంద్రబాబు నాయుడు నిరంకుశ వైఖరిని ఖండిస్తూ పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు నిరసన ర్యాలీచేపట్టారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి నిరంతరం నిరుపేదల అభివృద్ధి కొరకు శ్రమిస్తున్నాడని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ వైస్ చైర్మన్ జాకీర్ పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బుగ్గన జయచంద్ర రెడ్డి ప్రముఖ పారిశ్రామికవేత్త బొబ్బల శివరామిరెడ్డి నంద్యాల జిల్లా టీసీ అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామచంద్రుడు నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ గౌడ్ , పట్టణ యూత్ అధ్యక్షుడు రాజు వర్ధన్, దొర పల్లె చిరంజీవి డోన్ పట్టణ సచివాలయాల కన్వీనర్ కురుకుంద హరి, కౌన్సిలర్ దార హరినాథ్ రెడ్డి కౌన్సిలర్ రమణ సర్పంచ్ బంగారు జయచంద్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## అధ్వానంగా చెరువు రహదారి

**విశాలాంధ్ర - చాగలమర్రి :** మండలంలోని ముత్యాలపాడు ఎర్ర చెరువుకు వెళ్లే తారు రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. ఏళ్లు గడుస్తున్న పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కింద 1,000ఎకరాల్లో రైతులు ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు సాగు. చేస్తున్నారు. దారుణంగా ఉన్న ఈ రహదారిలో పంట పొలాలకు వెళ్లడానికి, ఎరువులు, పంట దిగుబడులు తరలించడానికి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకొని రహదారిని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

## పేదలకు సొంతింటి కలకై ఇళ్ల స్థలాల కేటాయింపు

**విశాలాంధ్ర - నంద్యాల :** పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రమంతటా ఇల్లు లేని పేదలకు జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి వారి చిరకాల కోరికను నెరవేరుస్తున్నారు. ఇందులో భాగంగా నంద్యాల నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా లు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా, రాజకీయాలకు, ప్రాంతాలకు, కులమతాలకు, పార్టీలకతీతంగా రాండమైజేషన్ విధానంలో ఇళ్ల స్థలాలను కేటా యించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పేదలకు నంద్యాల నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు అందించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మొదటి విడతగా 3006 మంది అర్హులైన పేదవారికి ఇళ్లస్థలాలు కేటాయించడం జరుగుతుందని, వీరికి ఈ నెల 23వ తేదీ నుండి ఇళ్ల పట్టాలను అందించే ప్రక్రియను ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. రెండవ దశలో 1209 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి, ఎంఆర్ఓ శ్రీనివాసులు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు, మీడియా ప్రతినిధులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 6వ తరగతికి దరఖాస్తు చేసుకోండి

**విశాలాంధ్ర - వెలుగోడు :** వెలుగోడు మండలంలో 5వ తరగతి చదివిన విద్యార్థులు ఏ.పి మోడల్ స్కూల్‌లో 6 తరగతి లో చేరుటకు ఈ నెల 25 తేదీ లోగా దరఖాస్తు ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. 11- 6 - 2023 న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఎస్సి, ఎస్టీ లు రూ75 లు, బి.సి, ఓసిలు రూ.150 లు పరీక్ష ఫీజు చెల్లించాలని,ఆన్ లైన్‌లో అప్లై చేసిన డాక్యుమెంట్లు మోడల్ స్కూల్ వెలుగోడు నందు ఇచ్చి వెరిఫై చేసుకోవాలని అన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్,సెల్ నెం 7032996490 సంప్రదించగలరు.

## మహిళల జీవనోపాధికై కృషి చేయండి

**విశాలాంధ్ర - పాణ్యం :** మండల కేంద్రంలో గల పొదుపు సమైక్య ఆఫీసులో జిల్లా స్థాయి రెండు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని డిఆర్డిఏ వైకెపి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా పీడి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘం మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడం కోసం గాను, గ్రామాలలో ఎవరైతే చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని జీవనోపాదులు చేసుకుంటున్నారు. అటువంటి వారిని గుర్తించి, వారు ప్రస్తుతం చేస్తున్న డెవలప్మెంట్ చేసుకోవడం కోసం గాను డబ్బులు అవసరం అయితే అటువంటివారిని మండలానికి 25 మందిని గుర్తించి వారికి వ్యక్తిగతంగా రుణాలు ఇప్పించడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు రాష్ట్ర స్థాయిలో సర్ఫ్ నుండి కుదుర్చుకోవడం జరిగింది. అందులో భాగంగానే ఈరోజు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది, స్వయం సహాయ సంఘ సభ్యులు ప్రస్తుతం చేస్తున్న జీవనోపాధిని డెవలప్మెంట్ చేసుకోవడం కోసం రెండు లక్షల పైబడి పై లక్షల వరకు వ్యక్తిగతంగా రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్స్ కూడా ముందుకు వస్తున్నారు కాబట్టి ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని గ్రామాలలో ఎవరైతే చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే జీవనం సాగిస్తున్నారో అటువంటి వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవలసిందిగా సిబ్బంది అందరినీ ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు అయినటువంటి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ, రామచంద్ర రెడ్డి, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ నాగరాజు,ఫిషరీస్ డిపార్ట్మెంట్ పశుసంవర్ధక శాఖ నుంచి జెడి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ ఎమ్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి , తదితర అధికారు లందరూ హాజరై తమ తమ డిపార్ట్మెంట్లలో జరిగేటటువంటి కార్యక్రమాల గురించి పూర్తిస్థాయిలో ఏపిఎంలకు సీసీలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాంక్ లింకేజ్ కోఆర్డినేటర్ ఎల్లయ్య, జిల్లా డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ యూనిట్ నుంచి దానం , పాణ్యం మండలం ఏపిఎమ్ పసాద్ హాజరు కావడం జరిగింది. ముఖ్యంగా నంద్యాల జిల్లా గాను రాష్ట్ర ప్రభుత్వం ఈ 2023 24 ఆర్థిక సంవత్సరంలో మహిళా ఎంటర్ప్రైజెస్‌గా 700మంది మహిళలను గుర్తించి వారికి ఒక్కొక్కరికి 5.00 లక్షల రూపాయలు చొప్పున 35 కోట్లు ఇప్పించాలని టార్గెట్గా నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 29 మండలాల ఏపీఎంలు సీసీలు హాజరు కావడం జరిగింది.

# ఎంపీ అవినాష్‌రెడ్డి పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** సీబీఐ వార్త కవరేజ్‌కు వెళ్ళిన ఏబీఎన్, హెచ్ఎంటీవీ రిపోర్టర్స్, కెమెరామెన్స్‌పై దాడి చేసిన వారిని, దాడికి ప్రోత్సహించిన వారిపై హత్య యత్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఐజేయూ జాతీయ సమితి సభ్యులు జి.కొండప్ప,ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఈ.ఎన్.రాజు,కె.శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి అంజి, ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శులు శివరాజ్‌కుమార్, అవినాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి, మధు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ అధికారులు ఎంపీ అవినాష్ రెడ్డిని విచారణకు పిలవడం జరిగిందన్నారు. తన తల్లికి బాగా లేదని, విచారణకు హాజరు కాలేనని లాయర్లకు చెప్పి పులివెందులకు బయలుదేరారన్నారు. అయితే అవినాష్‌రెడ్డి పులివెందులకు వెళ్తున్నారా..? లేక ఇక్కడే ఉంటున్నారా..? అని తెలుసుకోవడం కోసం సీబీఐ ఆయనను వెంబడించారు. దీంతో మీడియా ప్రతినిధులు కూడా అధికారులను ఫాలో కావడం జరిగింది అన్నారు. అయితే ఇది గమనించిన ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులుఏబీఎన్,హెచ్ఎంటీవీ వాహనాలను ఆపి వాటిని ధ్వంసం చేయడమే కాకుండా వీడియో జర్నలిస్టుల చేతిలో ఉన్న కెమెరాలు లాక్కొని ధ్వంసం చేయడం దారుణం అన్నారు. అంతేకాక కెమెరాల ధ్వంసాన్ని అడ్డుకోబోయిన రిపోర్టర్స్ పైన వీడియో జర్నలిస్టుల పైన దాడి చేసి గాయపరచడం దుర్మార్గమన్నారు. మాజీ మంత్రి హత్య విషయమై ఏం జరుగుతుంది అనేది తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరు ఆసక్తి చూపిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే రిపోర్టర్లు క్షణక్షణం ఈ కేసు దర్యాప్తును ఫాలో చేస్తున్నారని అన్నారు. మీడియా ప్రతినిధుల పైన దాడి చేసిన వారిని, ప్రోత్సహించిన వారిని వెంటనే అరెస్టు చేసి వారిపై అత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు నిత్య కృత్యంగా మారాయని ఇది చాలా బాధాకరమని అన్నారు. జర్నలిస్టులపై దాడులను ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మహిళ రేంజ్లర్లను లైంగికంగా వేధించిన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** ప్రపంచ నలుమూలల భారతదేశ కీర్తిని వ్యాపింపజేసిన భారతీయ మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి బ్రిజూ భూషణ్ శరన్ సింగ్ సభ్యత్వం రద్దుచేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, డిహెచ్ పిఎస్,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి పోస్ట్ కార్డులు పంపి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య నగర కార్యదర్శి వరలక్ష్మి ,ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. జగన్నాథం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసులు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్‌కుమార్లు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని మహిళలకి, మైనార్టీలకి, దళితులకి రక్షణ కరువైందని ఆయన మండిపడ్డారు. భారతదేశాన్ని భరతమాతతో పోల్చి ఎన్నికల్లో లబ్ధి పొందే బిజెపి ప్రభుత్వం భారత దేశంలో మహిళలకు ఏమాత్రం విలువనివ్వకుండా మను ధర్మాన్ని అమలు చేస్తూ మహిళలను వంట ఇంటికే పరిమితం చేయాలని ఆలోచన ఉన్న బీజేపీ పాలకులు అధికారంలో ఉన్నంతకాలం మహిళలకి రక్షణ లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ,ఒకపక్క చిన్న పరువు నష్ట కేసుకే ప్రతిపక్ష ఎంపీ రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయించడమే కాకుండా పార్లమెంట్ ఎంపీ హౌస్‌ను ఖాళీ చేయించిన బిజెపి ప్రభుత్వం మన దేశ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహిళ మల్ల యోధులు (రెజ్లర్లు) మా పైన లైంగిక వేధింపులు జరిగాయి మాకు న్యాయం చేయండి మహాప్రభు అని దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డులో ఆందోళన చేస్తా ఉంటే బిజెపి పార్టీ ఎంపీ బ్రిజూ భూషణ్ శరన్ సింగ్ కాపాడడం కోసం మల్ల యోధులు చేస్తున్న దీక్షను ఉక్కు పాదం తో అణిచివేయాలని చూస్తుందన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని పోస్ట్ బాక్స్ నందు ప్రధానమంత్రి కార్యాలయానికి పోస్ట్ కార్డు పంపించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య నాయకురాలు రేణుకమ్మ,జ్యోతి, నారాయణమ్మ,ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బాబయ్య నాయకులు చంటి ,శేషన్న ,కాసిం,ఏఐఎస్ఎఫ్ నగర్ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వివిధ కార్యక్రమాల పైన కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన అనేక మంది మహిళలు ఈ పోస్ట్ కార్డు ఉద్యమానికి మద్దతుగా వారి సంతకాలు చేసి పోస్ట్ కార్డును ప్రధానమంత్రికి పంపించారు.

# మేకడోనలో తాగునీటి కష్టాలు

**విశాలాంధ్ర - పెద్దకడబూరు :** గుక్కెడు మంచినీళ్ల కోసం రోజులు తరబడి ఖాళీ బిందెలను కొళాయిల వద్ద పెట్టి గంటల కొద్ది నిరీక్షించి మహిళలు తాగునీరు తెచ్చుకొనే పరిస్థితి మండల పరిధిలోని మేకడోన గ్రామంలో నెలకొంది. గ్రామ ఒడిలోనే ఎల్ఎల్సీ కాలువ, కూతంత దూరంలోనే నౌలేకల్ ఎస్ ఎస్ ట్యాంకు ఉన్నా మేకడోన గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. గ్రామంలో కొన్ని కాలనీలకు తాగునీరు సక్రమంగా అందడంలేదని, తాగునీటి కోసం రామాలయం గుడి వద్దకు వచ్చి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని మహిళలు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మేకడోన గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరారు.

# ఎడిపై స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఎడిపై స్కూలు గుర్తింపును తొలగించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో ఎడిపై స్కూల్లో ధర్నా నిర్వహి ంచారు. ఈ ధర్నాని ఉద్దేశించి ఏఐ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి మహేంద్రలు మాట్లాడుతూ సిబిఎస్ సిలబస్‌ల పేరుతోటి అన్ని నిబంధనలను తుంగలో తొక్కి గ్యాస్ గోడౌన్‌కు నానుకొని స్కూల్ కి పర్మిషన్ ఇవ్వడం నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. పొరపాటున గ్యాస్ లీక్ అయితే వందల మంది విద్యార్థులు ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి ఉందన్నారు. సిబిఎస్ నిబంధన ప్రకారమే గ్యాస్ గోడౌన్ కానీ పెట్రోల్ బంకులు వద్ద కానీ ఉన్నటువంటి ప్రాంతానికి రెండు కిలో మీటర్ల దూరంలో పాఠశాలలు కళాశాలలో ఉండాలని ఆ నిబంధనలు ఉన్నాయన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ఎడిపై స్కూల్ నిర్మాణం ఉందన్నారు. ప్రతి తల్లిదండ్రులు మేలుకోవాలని అదేవిధంగా చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే చందంగా కాకుండా పిల్లల ప్రాణాలు పోక ముందుకే ఎడిపై పాఠశాల గుర్తింపు రద్దు చేసి పాఠశాలను తొలగించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండే జీరో క్లాసు కూడా 80,000, 90,000 ఇలా ఫీజులు వసూలు చేస్తూ విద్యా ర్థుల తల్లి దండ్రుల నుంచి జలగల్లా రక్తం తాగుతున్నారని అంత కట్టినా కూడా విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేదని వారన్నారు.ధర్నా నిర్వహి స్తున్న విద్యార్థి సంఘం నాయకుల పైన పాఠశాల యాజమాన్యం దురుసుగా ప్రవర్తించడం దాడి చేయడానికి రావడం సిగ్గుచేటైన విషయమని దీన్ని వామపక్ష విద్యార్థి సంఘాలుగా తీవ్రంగా ఖండిస్తూ ఉన్నామ న్నారు. విద్యార్థి సంఘాల పట్ల కూడా అనుచితంగా వ్యాఖ్యలు చేస్తూ దౌర్జన్యం చేసినటువంటి స్కూల్ యాజమా న్యంపై క్రిమినల్ కేసులు బనాయించాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం కు విద్యార్థి సంఘాలకు జరిగిన గొడవ జరగడంలో విద్యార్థిసంఘాల నాయకులు పాఠశాలలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఇకనైనా కూడా అధికారులు మేలుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మునిస్వామి ,నగర కోశాధికారి అశోకు ,నగర ఉపాధ్యక్షులు మధు, నాయకులు నవనీత్ ,నాగరాముడు, మహేష్,మౌనేషు ,పిడి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ ,నాయకులు షేక్షా ,ప్రశాంత్,వీరేశ్ పాల్గొన్నారు.

# ఇళ్ళ నిర్మాణాల పురోగతిలో ఎంపీడీవోలు,హౌసింగ్ అధికారుల బాధ్యత కీలకం

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** ఇళ్ళ నిర్మాణాల పురోగతిలో ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులబాధ్యత కీలకం అని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన పేర్కొ న్నారు. శుక్రవారం ఎంపిడిఓలు, హౌసింగ్ ఇంజనీర్ లతో ఇళ్ళ నిర్మాణాల పురోగతి, ఉపాధి హామీ పనుల అమలు పై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిలో బేస్మెంట్ లెవెల్ నుండి బేస్మెంట్ లెవెల్ కు సంబంధించిన స్టేజ్ కన్వర్షన్ పనులలో ఎంపీడీవోల బాధ్యత కీలకమని, అదే విధంగా బేస్మెంట్ లెవెల్ నుండి కంప్లిషన్ స్థాయి వరకు సంబంధించిన స్టేజ్ కన్వర్షన్ పనులలో హౌసింగ్ అధికారుల బాధ్యత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. గత రెండు రోజులుగా జీరో చేసిన మండలాలు ఎక్కువగానే ఉన్నాయని, జీరో పురోగతి చూపించిన చిప్పగిరి, కోడుమూరు, హాలహర్వి, నందవరం మండలాల ఎంపీడీవో లు, హౌసింగ్ ఇంజనీర్ లను ఎందుకు పురోగతి సాధించలేదని కలెక్టర్ ప్రశ్నించారు. లబ్దిదారులను మోటివేట్ చేశామని, శనివారానికి పురోగతి చూపిస్తామని అధికారులు కలెక్టర్ కు వివరించారు. స్టేజ్ కన్వర్షన్ పనులలో ప్రతి రోజు పురోగతి చూపించారని, నిర్మాణపు పనులను వేగవంతం చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇంకెప్పుడు కూడా బిబిఎల్ నుండి బిఎల్ స్థాయిలో గానీ బిఎల్ స్థాయి నుండి కంప్లీటెడ్ స్థాయిలో గానీ జీరో నమోదు అవ్వకుండా చర్యలు తీసుకోవాలని, ఇంకొకసారి జీరో కనిపిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 11,646 ఇళ్లను పూర్తి చేయాలన్న లక్ష్యంలో భాగంగా గూడూరు అర్బన్, కోడుమూరు మండలాల్లో ఎక్కువ ఇళ్లు పెండింగ్ లో ఉన్నాయని,వాటిలో కూడా పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత హౌసింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఉపాధి హామీ పనులకు సంబంధించి లేబర్ మొబిలైజేషన్ 100 శాతం కోసిగి మండలం చేసినప్పుడు ఇతర మండలాల్లో ఎందుకు 90 శాతంలోనే ఆగిపోయాయని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు.వచ్చే సోమవారం నుండి ఖచ్చితంగా అన్ని మండలాలు 100శాతం లేబర్ మొబిలైజేషన్ చేయాలని కలెక్టర్ ఎంపిడిఓలను ఆదేశించారు.90శాతం కంటే తక్కువ లేబర్ ని మొబిలైజ్ చేసిన ఆదోని, కోడుమూరు మండల ఎంపిడిఓ లతో మాట్లాడుతూ వచ్చే వారానికి లేబర్ మొబిలైజేషన్ 100 శాతానికి తీసుకొని వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోకులం పేమెంట్ పనులకు సంబంధించి ఎంబుక్ ఎక్స్పెండిచర్ పనులను ఫిజికల్ గా వెరిఫై చేయమని మండలాలకు ఆదేశాలు జారీ చేశామని, కొన్ని మండలాలు పూర్తి చేశారు. ఇంకా పూర్తి చేయని ఆస్పరి, కోసిగి, కృష్ణగిరి, నందవరం, పత్తికొండ, పెద్దకడబూరు మండలాలు రెండు రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# పదోన్నతుల గందరగోళాన్ని నివారించండి

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యా యుల పదోన్నతులు బదిలీల పైన ఉండే గందరగోళాన్ని తక్షణం నివారించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూల్ నగరంలో అందలి సలాం ఖాన్ ఎస్టీయూ భవనంలో ఉపాధ్యా య పదోన్నతులు బదిలీల పైన సమీక్ష సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్ .గోకారి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యా యుల పదోన్నతుల పైన మీనమేశాల లెక్క వేస్తూ ఉత్తుత్తి పదోన్నతులతో ఉపాధ్యాయులను మోసం చేస్తున్నదని దీనివల్ల విద్యా రంగం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు .గత జనవరిలో 2500 రూపాయలతో పని సర్దుబాటు పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 5000 మందిఉపాధ్యాయులతో నాలుగు నెలలు వెట్టిచాకిరి చేయించుకు న్నారని ఇంతవరకు వారికి రావలసిన 2500 రూపాయలు ఇంతవరకు చెల్లించలేదని విమర్శించారు.అంతేకాకుండా గత నాలుగు నెలలుగా పని సర్దుబాటు పేరుతో 30% కోటా కింద వెళ్లిన ఉపాధ్యా యులు ఇప్పుడు పదోన్నతులు కోల్పోయే ప్రమాదం ఉందని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కే. జనార్దన్ సీనియర్ నాయకులు పి.సి. హెచ్.పాలయ్య, జి. నాగరాజు రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ సయ్యద్ ముదసిర్ ఆహమద్ తదితరులు పాల్గొన్నారు.

# అఖిలప్రియకు అస్వస్థత

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** ఏవీ సుబ్బారెడ్డిపై దాడి కేసులో అరెస్టు అయి 14రోజులు రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో స్వల్ప అస్వస్థతకు గురైయారు. తనకు ఛాతినొప్పి ఉందన్న విషయం జైలు అధికారులకు తెలియచేయడంతో వారు హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ డాక్టర్లు ఈసీజీ, 2డీఎకో పరీక్షలు నిర్వహించారు. అఖిల ప్రియకు ఆరోగ్యపరంగా అన్ని నార్మల్‌గా ఉన్నాయని, ఎటువంటి ఇబ్బంది లేదని వైద్యులు తెలియచేయడంతో వెంటనే ఆమెను కర్నూలులోని మహిళా జైలుకు తరలించారు.

# ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

**విశాలాంధ్ర - ఆదోని :** ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులకు సబ్ కలెక్టర్ సూచించారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్లోని రిసెప్షన్లో రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి విధుల్లో పూర్తి స్థాయి సిబ్బంది హాజరయ్యారా అని సూపర్డెంట్ డాక్టర్ లింగన్నను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవనీ హెచ్చరించారు. గత వారంలో జిల్లా కలెక్టర్ ఆదోని ఏరియా ఆసుపత్రిను తనిఖీ చేయగా బాత్రూములపై అసహనం వ్యక్తం చేయగా పది రోజుల్లోపు పూర్తి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశించిన శౌచాలయం పనుల పురోగతి పై పరిశీలించారు. ఇంకా ఒకరోజు లోపు పూర్తి స్థాయిలో టాయిలెట్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. సూపర్డెంట్ డాక్టర్ లింగన్న వైద్య సిబ్బంది ఉన్నారు.

# భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

**విశాలాంధ్ర - క్రిష్ణగిరి :** అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంపై క్రిష్ణగిరి ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి పోలీసులు దాడులు చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి 45మద్యం బాక్సులు స్వాధీనం చేసుకొని రెండు బైకులు ఒక కారును సీజ్ చేసినట్లు వెల్దుర్తి సీఐ యుగంధర్ తెలిపారు.శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో సీఐ యుగంధర్ పాత్రికేయులతో మాట్లాడుతూ మండల పరిధిలోని సంగాల గ్రామ సమీపంలో రాబడిన సమాచారం మేరకు అనంతపురంజిల్లాకు చెందిన రవికిరణ్ బెంగళూరు నుండి అక్రమంగా కర్ణాటక మద్యం మండల పరిసర ప్రాంతాలకు తరలిస్తుండగా క్రిష్ణగిరి ఎస్సై సమక్షంలో పోలీసులు వెళ్లి నల్లేని కొండ దగ్గర మద్యంపై దాడులు నిర్వహించారు అన్నారు. ఈదాడుల్లో సంగాల గ్రామానికి చెందిన కురువమద్దయ్య, తన కుమారుడు మోహన్,ఎరుకలచెరువు గ్రామానికి చెందిన ఎరుకల శ్రీనివాసులు ఉన్నట్లు ఆయన తెలిపారు. 45బాక్సుల్లో ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్స్ 4320 ఉన్నాయన్నారు. వీటి విలువ 4 లక్షల 32వేలని తెలిపారు. రెండు బైకులు 70వేలు, మహేంద్ర కారు 4లక్షలు విలువ చేస్తా అన్నారు. కురువ మద్దయ్య రవికిరణ్‌తో స్నేహం ఏర్పడి అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతూ డబ్బుకు అలవాటు పడి చుంచు ఎర్రగుడి, సంగాల,ఎరుకల చెరువు గ్రామాలకు సరఫరా చేస్తున్నారన్నారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినేడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోలీసులు వెంకటేశ్వర్లు, అంజి శేఖర్, రామకృష్ణ, భీమన్న ,గిడ్డయ్య, మల్లికార్జున, పాండు, లక్ష్మీనారాయణ వన్నూరు తదితరులు పాల్గొన్నారు.

**కౌతాళం :** మండల పరిధిలోని నది తీర గ్రామమైన వల్లూరు శివారులో కర్ణాటక వైపు నుండి నదిలో తెప్పే సహాయంతో ఆరు లక్షల విలువగల 64ఒరిజినల్ ఛాయిస్ బాక్సులను తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న సీఐ ఎరిషావలి ఉత్తర్వుల మేరకు కౌతాళం ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి, సిబ్బంది అశోక్, హుస్సేన్ భాష,వీరేష్, నరేంద్ర, రంగన్న, రామచంద్ర బృందం ఉదయం 6గంటల 30నిమిషాలకు అవతలి వైపు నుండి నది దాటుతుండగాముద్దాయిలను పట్టుకున్నారు. తోవి వినోద్ కుమార్ ,కుప్పగల్ శీను, నడిగేరి ఉరుకుంద, వీరు నుండి అక్రమ మద్యం రెండు మోటార్ సైకిళ్ళు, ఒక కెత్తెలు స్వాధీనం చేసుకున్నారు కేసు నమోదు చేసుకుని రిమాండ్ కు తరలించారు సిబ్బందికి సిఐ ఏరిసా వలి రివార్డులు అందజేశారు చరవాణి ద్వారా ఎస్ పి కృష్ణ కాంత్ అభినందనలు తెలియజేశారు.

# సిద్ధరామయ్యతోనే కర్ణాటక అభివృద్ధి సాధ్యం

**విశాలాంధ్ర - ఆదోని రూరల్ :** కానీ విని ఎరుగని రీతిలో కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవడం హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి నీలకంఠప్ప,పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు దిలీప్ దోక అన్నారు.శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడుతూ నేడు కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేయబోతున్న శుభ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గం తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. సిద్ధరామయ్య నాయకత్వంలో కర్ణాటక రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని, కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఆలూరు,ఆదోని, మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తారని ఆశా వ్యక్తం చేశారు. ప్రధానమైన రహదారులకు మరమ్మతులు చేపడుతూ మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చొరవ చూస్తారని అభిప్రాయ పడ్డారు. కర్ణాటక ప్రాంతం నుంచి ఆంధ్ర ప్రాంతంలోకి వచ్చే సాగునీరు ఆంధ్రకు చెందాల్సిన వాటా మేరకు అందించేందుకు ప్రత్యేక దృష్టి ఉంచి సమస్యకు పరిష్కారం చూపుతారని అభిప్రాయం తెలియజేశారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ కార్యదర్శి మారుతిరావు,పట్టణ ప్రధాన కార్యదర్శి సాయినాథ్,దేవి శెట్టి వీరేష్ ఉన్నారు.

# జీనియస్ కళాశాలపై కేసు నమోదు చేయాలి

**విశాలాంధ్ర - ఎమ్మిగనూరు :** పట్టణంలో ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా వెలసిన జీనియస్ గ్లోబల్ కళాశాల తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల మోసం చేస్తున్న కళాశాల యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన జీనియస్ గ్లోబల్ కళాశాల ఫ్లెక్సీ బోర్డులను చించి సోమప్ప సర్కిల్ నందు దగ్ధం చేశారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి.రంగన్న, జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర మాట్లాడుతూ పట్టణ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు మోసం చేయడానికి ఏర్పాటుచేసిన జీనియస్ గ్లోబల్ కళాశాలకు ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి ఎట్టి పరిస్థితిలో కళాశాలలో మీ పిల్లలను చేర్పించి మీ పిల్లల జీవితాలను నాశనం చేసుకోవద్దని గత వారం రోజుల క్రితం రీజినల్ ఇన్స్పెక్షన్ ఆఫీసర్ స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు.అయినా కళాశాల యజమాన్యం ఆర్ఐఓ మాటలను పెడిచెవిన పెట్టి తప్పుడు ప్రచారాలతో విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి వారి ద్వారా అక్రమ అడ్మిషన్లు చేయించుకోవడం జరుగు తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీనియస్ కళాశాల భవనాన్ని సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ముని స్వామి, ఖాదర్, దస్తగిరి,సమీర్, వెంకటేష్, రఘు, నరసింహులు, వేరెష్ పాల్గొన్నారు.

# నగరం ప్రగతికి నిలయం

**విశాలాంధ్ర - కర్నూల్ సిటీ :** వందలాది కోట్ల రూపాయలతో నగరంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులతో కర్నూలు నగరం ప్రగతికి నిలయంగా మారుతోందని నగర మేయర్ బి.వై. రామయ్య అన్నారు. శుక్రవారం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న 19వ వార్డు మథర్ ల్యాండ్‌లో రూ.50లక్షల రూపాయలతో డబ్లూబియం. రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డితో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నూతన రహదారులు, మున్సిపల్ స్థలాలకు ప్రహరీ గోడలు, డ్రైన్స్, టాయిలెట్లు, వీధిలైట్లు, సెంట్రల్ మీడియన్స్ ల నిర్మాణం, కూడళ్ళ, పార్కుల సుందరీకరణ, చారిత్రాత్మక కొండారెడ్డి బురుజు, సంకల్ బాగ్ ప్రాంతాల ఆధునికీకరణ, సకల సౌకర్యాలతో రూపుదిద్దుకున్న కమ్యూనిటీ హాల్స్, షాపింగ్ కాంప్లెక్స్, అర్బన్ హెల్త్ సెంటర్లు, శానిటేషన్ డివిజన్ కార్యాలయాలు, స్టేడియాలు, గ్రంథాలయాలు, పాఠశాలలు, నగర పాలక సంస్థ నూతన కార్యాలయం, ప్రత్యేక దృష్టితో స్మార్ట్, ఈట్ ఫర్ స్ట్రీట్స్ వంటి పనులతో ఆదర్శ నగరంగా కర్నూలు నిలుస్తుందని అన్నారు. గత రెండేళ్లలో రూ.506 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టగా అవి వివిధ దశల్లో ఉన్నాయని, ఎక్కడా కూడా కమిష న్ల కోసం నాసిరకం పనులు చేయించలేదన్నారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, రాష్ట్ర వీరశైవ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, కార్పొరేటర్లు లక్షిరెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, ఎస్.ఈ.డి.వేణుగోపాల్,ఎం.ఈ. పి.వి. శేషసాయి, డిఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ. జనార్ధన్, శానిటేషన్ ఇంస్పెక్టర్ ఆర్.రాజు, ట్యాప్ ఇంస్పెక్టర్ రఫిక్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అక్కమి హనుమంత్ రెడ్డి లు పాల్గొన్నారు.

# వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడుదాం

**విశాలాంధ్ర - పత్తికొండ :** రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడుదామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కే.ఈ.శ్యాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో వైకాపా అరాచకాలపై తెలుగుదేశం పార్టీ చేపట్టిన మన రాష్ట్రానికి ఇదేమి ఖర్మ ముగింపు జీపు జాతాను తెదేపా సీనియర్ నాయకులు తిమ్మయ్య చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. కేఈ శ్యాం బాబు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం లో వైకాపా అరాచకాలను ఇదేమి ఖర్మ కార్యక్రమం పేరుతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయానికి నివేదికలు పంపడం జరిగిందని తెలిపారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో వైకాపాను గద్దె దింపి, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తిప్పన్న, తిరుపాల్ నాయుడు, రంగప్ప, సోమ్లు నాయక్, శ్రీనివాసులు, విజయ మోహన్ రెడ్డి,సురేంద్ర, సత్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# వాలంటరీల సేవలకు గుర్తింపే పురస్కారాలు

**విశాలాంధ్ర - ఆస్పరి :** ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో వాలంటరీల పాత్ర కీలకమని, వారి సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం పురస్కారాలిస్తోందని జిల్లా కేడీసీసీ డైరెక్టర్ మూల్యంతి రాఘవేంద్ర మేజర్ పంచాయతీ సర్పంచ్ మోలింతే రాధమ్మలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయ కేంద్రంలో మేజర్ గ్రామపంచాయతీ ఇవో రామాంజ నేయులు అధ్యక్షతన వాలంటరీలకు శాలువా కప్పి ప్రశంసా పత్రాలను అందజేసి సత్కార సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కేడీసీసీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, సర్పంచ్ మూలింటి రాధమ్మలు పాల్గొని మాట్లాడుతూ15 ఆగస్టు 2019వ తేదీన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, వాలంటీర్ల వ్యవస్థను ప్రారంభించారన్నారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, వరుసగా నాలుగో ఏడాది నిర్వహిస్తున్న వాలంటీర్లకు వందనం సన్మాన కార్యక్రమ నిర్వహణలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని, వారి సేవలు వెల కట్టలేనివని, వాలంటీర్లు అంటే జగనన్న సైనికులు అని, ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల ముంగిటకు తీసుకెళ్తున్న వాలంటీర్లు నిజమైన సంక్షేమ సేవకుడే గ్రామ వాలంటీర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, వాలంటరీలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్డీఎస్ నిర్మాణం చేపట్టాలి

**విశాలాంధ్ర - పెద్దకడబూరు :** ఆర్డీఎస్ నిర్మాణం చేపట్టాలంటూ శుక్రవారం రాయలసీమ స్టీరింగ్ కమిటీ మరియు అభ్యదయ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాగిమాన్ దొడ్డి, గంగులపాడు, దొడ్డిమేకల, కంబలదిన్నె, జాలవాడి, హెచ్ మురవణి, పెద్దకడబూరు తదితర గ్రామాల్లోని ప్రజలను, అధికారులను కలసి విస్తృతంగా సంతకాల సేకరణ జరిపారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఖాజా, కృష్ణ, మోహన్ మాట్లాడుతూ పాలకుల చేతిలో రాయలసీమ తరతరాలుగా మోసపోతూనే ఉందని, అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సీమ ప్రాంతం వాసులే ఉన్నా రాయలసీమకు మాత్రం ఒరిగిందేమీ లేదని విమర్శించారు. దశాబ్దాల క్రితం విజయనగర రాజులు తవ్వించిన చెరువులు, బ్రిటిష్ వారి కాలం నాటి కాలువలు తప్పితే రాయలసీమకు సరైన నీటి ప్రాజెక్టులు లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సీమవాసులు ఎన్నాళుగానో ఎదురుచూస్తున్న ఆర్డీఎస్ ఇంతవరకు పూర్తి చేయకపోవడం దారుణం అన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు మధ్య కర్ణాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్టు వచ్చి తుంగభద్ర జలాలకు ఎసరు పెట్టి రాయల సీమ భవిష్యత్తును ఆందోళనలో పడేసిందన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆర్డీఎస్, వేదవతి, సంగమేశ్వర వద్ద బ్రిడ్జి కం బ్యారేజినని నిర్మించాలని, కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు రామాంజనేయులు,దావీదు,వీరేష్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని అందుకోకపోతే చర్యలు

**విశాలాంధ్ర - చిప్పగిరి :** గృహ నిర్మాణ పనుల్లో లక్ష్యాన్ని అందుకోకపోతే సంబంధిత హౌసింగ్ అధికారులపై చర్యలు తప్పవని కర్నూల్ హౌసింగ్ పిడి వెంకటనారాయణ హెచ్చరించారు. శుక్రవారం ఆలూరు నియోజకవర్గం మండల కేంద్రమైన చిప్పగిరి లోనే జగనన్న హౌసింగ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదల కొరకు జగనన్న కాలనీల ద్వారా స్థలాలతో పాటు గృహ నిర్మాణ పనులను చేపట్టడం జరిగింది. జగనన్న గృహ నిర్మాణాలలో చిప్పగిరి మండలం వెనుకబడటం వల్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారని, ఇప్పటికైనా మండల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆయన తెలియజేశారు. మండల కేంద్రమైన చిప్పగిరి జగనన్న కాలనీలో గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టకపోవడం వల్ల తక్షణమే థర్డ్ పార్టీ ద్వారా గృహ నిర్మాణ పనులు చేపట్టి అనుకున్న సమయానికి లబ్ధిదారులకు అందించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి గోవిందరాజులు, ఆలూరు హౌసింగ్ డిఇ ఆదినారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి బాలన్న, మండల హౌసింగ్ అధికారిని భవ్య పాల్గొన్నారు.